

గెడ్డలో యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండలంలోని బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలతో యువకుడు గెడ్డ దాటుతుండగా గల్లంతయ్యాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యమైంది. అరకులోయ మండలం చొంపి గ్రామానికి చెందిన కొర్ర.సుధాకర్,తండ్రి అప్పలస్వామి(30) ఈనెల 16న గడ్డ ప్రవాహంలో గల్లంతయ్యాడు.చోంపి స్వగ్రామం నుండి అరకులోయ తన నిత్యావసర సరుకుల కోసం బయలుదేరి వెళ్ళాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. గెడ్డ దాటుతుండగా కాలుజారి గడ్డలో గలంతయింట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం చొంపి వంతెన సమీపంలో గడ్డలో విగిత జీవిగా కనిపించాడు. సుధాకర్ మృతదేహాన్ని చూసిన బంధువులు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.



సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్

ఆశావహ జిల్లాల అభివృద్ధికి సహకారం

కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆశావహ జిల్లాల (ఎస్పిరేషనల్ జిల్లాలు) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని కేంద్ర ప్రణాళిక, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ అన్నారు. ఆయా జిల్లాల ప్రత్యేక అభివృద్ధి అవసరాలపై తనకు నివేదిక అందజేస్తే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా జిల్లాలకు నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఆశావహ జిల్లాల కార్యక్రమంలో భాగంగా నీతి ఆయోగ్ గుర్తించిన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఆ జిల్లాల కలెక్టర్లు ఎఎస్.దినేష్ కుమార్, ఎ.శ్యాంప్రసాద్‌లు చేసిన ప్రజెంటేషన్ పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. నీతిఆయోగ్ జిల్లాలకు కేటాయించిన నిధుల వినియోగంపై కలెక్టర్లు తెలిపారు. జిల్లాల ప్రత్యేక అవసరాలను, అభివృద్ధిలో నిధుల పరంగా ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎఎస్ఆర్ జిల్లాను పూర్తిగా సేంద్రీయ ఉత్పత్తుల జిల్లాగా రూపొందించాలని భావిస్తున్నామని కలెక్టర్ దినేష్ కుమార్ చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని పాఠశాలల్లో క్రీడాభివృద్ధి కేంద్రాలను అభివృద్ధి చేసి ఆయా స్కూళ్లలో విద్యతోపాటు క్రీడలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. .ప్రస్తుత తరం గిరిజన విద్యార్థులు కనీసం ఇంటర్మీడియెట్ స్థాయి వరకు విద్యను పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. కేవలం చెక్ డ్యామ్‌లపైనే ఆధారపడి పంటలు పండించే పరిస్థితి వుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో వెనుకబడి ఉందని ఆ జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లాలో సూక్ష్మస్థాయి పరిశ్రమలు మినహా మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏవీ లేవన్నారు. దీనిని అధిగమించేందుకు సాంకేతిక విద్య అవకాశాలు పెంపొందించేలా ఐటిఐలు, సాంకేతిక విద్యా సంస్థలు అధికంగా ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎఎస్ఆర్. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, రంపచోడవరం పిఒ కె.సింహాచలం, చింతూరు పిఒ అపూర్వ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు కాఫీపై ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్‌ను కేంద్ర మంత్రి ఇంద్రజిత్ సింగ్ పరిశీలించారు. ఎఎస్ఆర్ కలెక్టర్ దినేష్ కుమార్ ఆయనకు అరకు కాఫీ ప్రత్యేకతలను, ఈ ఉత్పత్తి మార్కెటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. కేంద్ర మంత్రికి అరకు కాఫీ ప్యాకెట్‌తో పాటు చింతూరు ఏజెన్సీ ప్రాంతంలోని కూనవరం మండలం పైడిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు చేతితో రూపొందించిన పట్టు చీరను బహూకరించారు.

ఇంకా ఎన్నాళ్లీ డోలీ మోతలు..!

అంతరిక్షంలోకి సులువుగా వెళ్లి తిరిగి వచ్చేస్తున్న రోజుల్లో మనం ఉన్నాం. సాంకేతికంగా ఎంతో పురోగతి చెందాం. ఇంకా ఎన్నాళ్లు మనిషిని మనిషి మోసే పరిస్థితి. ఈ పరిస్థితి నుంచి బయటపడలేమా.. చతుర్భుజి, అష్టబుజి అంటూ రహదారులు నిర్మిస్తున్నామని భుజాలు చరుచుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇటువంటి గ్రామాలు కనబడవా.. కనీసం ఈ గ్రామాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లు కూడా వేయలేరా అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చల్లనిశిల్ప గ్రామం నుంచి గర్భిణిని వాగు దాటించి తీసుకెళ్తున్న గ్రామస్తులు

- చల్లనిశిల్ప గ్రామానికి రహదారి కరువు
- డోలీపై గర్భిణిని వాగు దాటించి పిహెచ్‌సికి తరలించిన వైనం
- వాగు ఉధృతి లేకపోవడంతో తీసుకెళ్లగలిగామన్న గ్రామస్తులు
- సకాలంలో తీసుకెళ్లడంతో తల్లీ, బిడ్డా క్షేమం
- రోడ్డు వేయాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -సీలేరు:

మారుమూల గ్రామాల్లో నేటికీ రహదారులు నిర్మాణానికి నోచుకోక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ చల్లనిశిల్ప గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని డోలీమోత సహాయంతో పిల్లిగెడ్డ వాగులో కాలినడకన తీసుకెళుతూ అష్టకష్టాల మీద ప్రధాన రహదారికి చేర్చారు. చల్లనిశిల్ప గ్రామానికి చెందిన కొర్ర సావిత్రికి (35) శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో సీలేరు పిహెచ్‌సికి సమాచారం ముందుగా చేరవేశారు. అయితే గ్రామానికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేదు. గతంలో గ్రామస్తులు వాగుపక్కన టేకుతోట సమీపం నుంచి మట్టి దారి గ్రామస్తులు శ్రమదానంతో నిర్మించుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో సంభవించిన భారీ వర్షాలు, వరదలకు మట్టి రోడ్డు కొట్టుకుపోయి వాహన రాకపోకలు సాగించే పరిస్థితి లేకుండా పోయింది. గిరిజనులు తమ గ్రామానికి 100 మీటర్లు సిసి రోడ్డు నిర్మించాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను కోరినా ఎవరు స్పందించలేదు. దీంతో గిరిజనులు గత్యంతరం లేక అత్యవసర పరిస్థితుల్లో రోగులను గర్భిణులను తరలించడానికి ప్రాణాలు పణంగా పెట్టి వాగు నుంచి డోలిమోత సహాయంతో దాటించి ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు రక్షించుకునే పరిస్థితి ఏర్పడుతోందని పిల్లిగెడ్డ గ్రామస్తులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇటీవల వాగు ఉధతి తగ్గింది. లేదంటే ఈ రోజు ఆ గర్భిణి పరిస్థితి ఏంటి అనేది తలచుకుంటేనే భయం వేస్తోందని ఆ గ్రామస్తులు తెలిపారు. సకాలంలో ఆమెను డోలీపై ప్రధాన రహదారికి తరలించి అక్కడ నుంచి అంబులెన్స్‌లో సీలేరు పిహెచ్‌సికి తరలించి కాపాడుకోగలిగామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-దంబ్రిగుడ: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ అన్నారు. పోతంగి పంచాయతీ పనసపుట్టు మోడల్ కాలనిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిపై కరపత్రాలను అందజేశారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోడల్ కాలని అభివృద్ధికి గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తెదేపా హయంలోనే మోడల్ కాలనితో పునరావసం కల్పించి ఆదుకున్నారని గిరిజనులు మొద మెట్టుకున్నారు. వీధి రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని వేడుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల అభివద్ధి తెదేపాతోనే సాధ్యమని, అభివద్ధి, సంక్షేమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బీమరాజు, మాజీ ఎంపీపీ దన్నెరావు, టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

ఉపాధ్యాయున్ని నియమించాలని ఆందోళన

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: మండలంలోని అనంతగిరి గిరిజన ప్రాథమిక పాఠశాలలో తక్షణం ఉపాధ్యాయులను నియమించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు 32 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే గత రెండు సంవత్సరాల నుండి కేవలం ఒక్క సిఆర్‌టి తోనే పాఠశాల నడుస్తోందని ఉపాధ్యాయులు ఎవరు పాఠశాలకి రావడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సొంత గ్రామం అయినప్పటికీ ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడం విశేషం. పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు నియమించాలని పలుమార్లు విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ పాఠశాలకు ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.
ఉన్న ఒక్కరూ కూడా రావడం లేదు.

వై రామవరం : మండలంలోని దేవరమడు గ్రామం ఎంపిపి పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయులు తమకు వద్దని గ్రామస్తులు ఎంఇఒకి ఫిర్యాదు చేసినట్టు పాఠశాల విద్యాకమిటి చైర్మన్ బుల్లయ్య తెలిపారు. పాఠశాలలో 82 మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడే ఉన్నారని అతను కూడా సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారని ఉన్న ఒక్క ఉపాధ్యాయుడూ రావడం లేదని వాపోయారు. ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:మండలంలోనీ పలు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమిం చాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోర్రా త్రినాథ్, మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీనులు శుక్రవారం పాడేరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ లక్ష్మీపురం పంచాయితీలో 8 పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, బుంగపుట్టు పంచాయతీలో 6 గ్రామాల పాఠశాలల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి పాఠశాలలను కొనసాగించాలని పేర్కొన్నారు. పాఠశాలలు పున్నప్రారంభమై దాదాపుగా రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు బడికి దూరమై డ్రాప్ అవుట్స్ ఆవకాశం ఉందన్నారు. లక్ష్మీపురం పంచాయతీలో పాఠశాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. గిరిజన సంఘ మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ ఆగిపోయిన పీఎం జన్మన్ రోడ్ల తక్షణమే పనులు ప్రారంభించాలని ఎంటిఎస్ ఉపాధ్యాయులను తక్షణమే నియమించి తరగతులు ప్రారంభించారని కోరారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. గిరిజన మహిళా అభ్యర్థులు 35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని చెప్పారు. బిఎస్ సి నర్సింగ్ విద్యార్హతలు కలిగి రెండు సంవత్సరాల క్లినికల్ అనుభవం ఉండాలన్నారు. జిఎన్ఎం నర్సింగ్ కలిగిన అభ్యర్థులు మూడు సంత్సరాల అనుభవం ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖలో 8 నుండి 10 నెలలు శిక్షణ అందించి జర్మన్ బాషను నేర్పిస్తారని చెప్పారు. అనంతరం ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించి జర్మనీ పంపించడం జరుగుతుందన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులకు పంపించడం భారత కరెన్సీలో సుమారు రూ.2లక్షల వరకు జీతం పొందుతారన్నారు. అసక్తి కలిగిన గిరిజన మహిళా అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల, పూర్తి వివరాలకు గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఆధార్ సేవలు సక్రమంగా అందించాలి'

ప్రజాశక్తి - కొయ్యూరు : ఆధార్‌సేవలు సక్రమంగా అందించాలని కొయ్యూరు ఎంపిడిఒ జిడివి ప్రసాదరావు ఆధార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం బంగారమ్మపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆధార్లో మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని సూపర్‌వైజర్ ప్రసాదుకు సూచించారు.

విద్యార్థికి మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - కొయ్యూరు : ఇటీవల మండలంలోని బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లి గ్రామానికి చెందిన మర్రిశెట్టి సత్తిబాబు (12) అనే విద్యార్థి జ్వరంతో పాటు, ఫిట్స్ కూడా రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని ముందుగా రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్ తెలిపారు. తమ సిబ్బంది విద్యార్థిని పరామర్శించారని చెప్పారు. సత్తిబాబు మంప గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు.

సీలేరు - విజయవాడ బస్సుకు రిజర్వేషన్ సదుపాయం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం విజయవాడ డిపోకు చెందిన సీలేరు- విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్‌సర్వీస్‌కు రిజర్వేషన్ సౌకర్యం నేటి నుంచి అందుబాటులో ఉంటుందని విజయవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ పేర్కొన్నారు. ప్రతిరోజు సీలేరులో ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి వయా భద్రాచలం విజయవాడ సాయంత్రం 6:30 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. అదే రోజు రాత్రి విజయవాడ ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి 9.45కు బయలుదేరి భద్రాచలం వయా చింతూరు, మోతుగూడెం మీదుగా సీలేరు మరుసటి రోజు ఉదయం 7:30కు చేరుకుంటుందని ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిక్కెట్ కావలసిన ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద గాని ఎటిబి ఏజెంట్ వద్ద పొందవచ్చున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10:30కు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అధికారులు తమవెంట రికార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.


రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

గ్రామంలో రేషన్ పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి:20 కిలోమీటర్లు దూరం ఎత్తైన కొండ కోనల నడుమ రేషన్ తెచ్చుకోవడంపై పలు పత్రికల్లో వచ్చిన వార్త కథనానికి స్పందించి ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రభుత్వానికి నివేదిక అందించిన విషయం తెలిసిందే. అధికారులు స్పందిస్తూ గ్రామాల్లోనే రేషన్ సరుకులు సంబంధిత సేల్స్ మెన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ కొండ శిఖరు బూరిగ, చిన్నకోనెల. గ్రామాలకు చెందిన 70 కుటుంబాలకు రెండో నెల రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సోమ్మెల. అప్పలరాజు, గ్రామస్తులు సింహాచలం, పెంటయ్య, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు.

సాఫీగా మండల సమావేశం

ప్రజాశక్తి-జీకే వీధి : మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిచారు. ఈ సమావేశం సాఫీగా సాగింది. పాత్రునిగుంట పాఠశాల ఉపాధ్యాయునిపై గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు అసహనం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు, ఏ టీ డబ్ల్యూ, ఎంఈఓ విద్యార్థుల భవిష్యత్తుపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశానికి విద్యాశాఖ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థులు గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అల్లూరి జిల్లా ఎస్‌పి బర్దర్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక అడిషనల్ ఎస్పీ ధీరజ్ తో కలిసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. గంజాయికి బానిస కావద్దని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. వారి ప్రాంతం లో ఎవరయినా గంజాయి పంట వేసిన, రవాణా చేస్తున్నా పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గంజాయిని అరికట్టడంలో అందరం భాగస్వాములు అయిన గంజాయి అరికడదామని పిలుపునిచ్చారు. విద్యార్థులు అందరు కష్టపడి చదువు కొని మంచి ఉన్నత స్థానాలకి చేరుకొని తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పాడేరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎల్ సురేష్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్ నగదు జమ చేయాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల:పీఎం జన్మన్ పథకంకు సంబంధించి పెంచిన లక్ష రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో వేయాలని డిటి గడుతూరి ఈశ్వరరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, మండల ఉపాధ్యక్షులు మువ్వల నాగేష్ మాట్లాడుతూ, గత నెల 27వ తేదీన ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఏలో మహా ధర్నా నిర్వహించగా బకాయి పడ్డ ఇరవై ఒక్క కోట్లు వెంటనే విడుదల చేస్తున్నామని హౌసింగి ఏడి ప్రకటించారన్నారు. బకాయి పడ్డ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మర్రి రంగారావు, కోర్ర బాలరాజు, వంతల అచ్చిబాబు, కొర్ర కామేశ్వరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం ఆర్‌నగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి దయనీయంగా తయారవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అంతర్రాష్ట్ర రహదారిలో నిత్యము వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆర్వీనగర్ లంక పాకలు ప్రధాన రహదారులు పెద్దపెద్ద గోతులుగా ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోయి ఎక్కడ గొయ్యి ఉందోకూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల పోలీసుల చొరవతో మట్టితో గోతులు పూడ్చించారు. రహదారి గురించి పలుమార్లు పలుపార్టీల రాజకీయ నాయకులు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. వినతిపత్రాలు అందించారు. అయినా ఫలితం లేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టలేదు. టిడిపి అధికారంలోకి వచ్చాక రహదారికి మహర్దశ పడుతుంది అని ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఆర్‌నగర్ నుంచి పాలగెడ్డ వెళ్లే రహదారి

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

రాకపోకలకు ఇక్కట్లు.. పట్టని అధికారులు



రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ముఖ్యంగా ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ప్రైవేటు వాహనాలు బారులు తీరుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డులోనే వాహనాలు నిలిపివేయడంతో రోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఆసుపత్రి గేటు వద్ద వాహనాల నిలుపుదల కారణంగా అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన అంబులెన్సులు ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సరైన సమయంలో చికిత్స అందించలేకపోతున్నామని వైద్య సిబ్బంది పేర్కొన్నారు

. ఈ సమస్యపై ఇప్పటికే పలు మార్లు సంబంధిత అధికారులకు తెలియజేశామని, అయినా వారు పట్టించుకోలేద జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు ముర్ల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆసుపత్రి గేటు ముందు 'నో పార్కింగ్' బోర్డులు పెట్టినప్పటికీ వాటిని పట్టించుకునే వారే లేకపోయారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. .

గంజాయి నిందితులను పట్టించిన డ్రోన్

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాతనగర్ నాగమల్లి లేఔట్, కొండవాళ్ల ప్రాంతాల్లో గంజాయి నిందితులను డ్రోన్ పట్టించాయి. శుక్రవారం స్థానిక సిఐ కెవి.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో డ్రోన్ సర్వేలెన్స్ నిర్వహించగా, తుప్పల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడాన్ని గమనించి, వారిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద 200 గ్రాముల గంజాయి పట్టుబడింది. విచారణలో వ్యక్తిగత వినియోగానికి గంజాయి కలిగి ఉన్నట్లు వెల్లడించడంతో వారిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

స్నేహితునిపై కత్తెరతో దాడి

- మద్యం మత్తులో రౌడీషీటర్ ఘాతుకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : మద్యం మత్తులో స్నేహితుడుపైనే రౌడీషీటర్ కత్తెరతో దాడికి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి కంచరపాలెం చాకలిగడ్డ వద్ద చోటుచేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ నగల్ల సాయి, కంచరపాలెం చాకలి గడ్డ ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు గోశాల మూర్తి ఇద్దరూ గురువారం రాత్రి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో నగల్ల సాయి చిన్నపాటి కత్తెరతో మూర్తిపై దాడికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు 112కు కాల్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న కంచరపాలెం పోలీసులు గాయపడ్డ మూర్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ నగల్ల సాయిని అదుపులో తీసుకునేందుకు ప్రయత్నించగా, మద్యం మత్తులో ప్రతిఘటించాడు. ఈ క్రమంలో అతని చేయి పోలీస్ రక్షక్ వాహనానికి తగలడంతో వాహనం వెనుక డోర్ అద్దం పాక్షికంగా దెబ్బతింది .ప్రస్తుతం సాయిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు కంచరపాలెం సిఐ రవికుమార్ తెలిపారు.

పిజిఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 141 ఫిర్యాదులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ విశాఖలో కేంద్ర మంత్రి సమావేశానికి హాజరవ్వడంతో డిఆర్ఒ కె.పద్మలత, ఎస్ డిసి ఎంవిఎస్ లోకేశ్వరరావు వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారులు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, అటవీ హక్కు పత్రాలు, రోడ్డు విస్తర్ణలో దుకాణాలు నష్టపోయి దుకాణాలకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయింపుపై ఫిర్యాదులు స్వీకరించారు. డుంబ్రిగుడ మండలం గుంటసీమ గ్రామానికి చెంది గుమ్మ దన్యమ్మ అటవీ హక్కు పత్రాలు కోసం వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం కుంతర్ల పంచాయతీ కన్నెల కట్టు గ్రామానికి చెందిన కె.మాధవరావు, కె.బాబూరావు తదితరులు తాగునీటి లేక ఇబ్బందులు పడుతున్నామని మంచినీటి సదుపాయాలు కల్పించాలని దరఖాస్తును అందజేసారు. రంపచోడవరం మండల కేంద్రానికి చెందిన చోళ్ల గౌరమ్మ రోడ్డు విస్తరణలో తన షాపును కోల్పోయానని దుకాణం పెట్టు కొనుటకు ప్రత్యామ్నాయ స్థలం మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం బడిమెల కాలనీకి మీదగా నిర్మిస్తున్న జాతీయ రహదారి పక్కన డ్రైనేజీలు నిర్మించాలని డి.రాజు, టి.వెంకటరావు తదితరులు వినతి పత్రం అందజేసారు. ముంచంగిపుట్టు మండలం కుమడ గ్రామానికి సిసి రోడ్డు, డ్రైనేజీ మంజూరు చేయాలని మఠం సింహాద్రి కోరారు.

1100 మీకోసం కాల్ సెంటర్ సేవలు..

అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికి పరిష్కారం కాకపోయినా సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చుని పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు అర్జీదారులకు సూచించారు. అర్జీదారులు కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకుని సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. అర్జీల ఎండార్స్ మెంటును అర్జీదారులకు రిజిస్టరు పోస్టులో పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఎస్ఇ జివి ప్రసాద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, పరిశ్రమల శాఖ ఎడి రమణారావు, సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డి.ఎర్రయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

డుంబ్రిగుడ: గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామానికి తారు రోడ్డు, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్ గ్రామస్తుడు, రాజ్ కుమార్ శుక్రవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదనీ కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారనీ చెప్పారు. అలాగే మొర్రిగుడ, సిరసగూడ, కంగారు సొల గ్రామంలో తాగు నీటి సదుపాయం కల్పించాలనీ కోరారు. జల్ జీవన్ మిషన్ ద్వారా బోర్ వెల్ తవ్వి, తాగు నీరు అందించకుండా వదిలి వేశారని చెప్పారు. పంచాయతీలో సెల్ సిగ్నల్ లేకపోవడంతో ప్రభుత్వ సేవలు ఇబ్బంది అవుతుందని చెప్పారు. సిగ్నల్ కోసం చాలా దూరం వెళ్ళవలసిన అవసరం ఏర్పడుతుందనీ చెప్పారు.



పిజిఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

బ్యాంకు సిబ్బంది పై విచారణ చేయాలి

దుంబ్రిగుడ : కించుమండ ఎస్బీఐ బ్యాంకు సిబ్బందిపై విచారణ చేపట్టి డ్వాక్రా సంఘానికి న్యాయం చేయాలని కోరుతూ పాడేరులో శుక్రవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో దుర్గమ్మ డ్వాక్రా సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బ్యాంకులో రుణాలు ఉన్నాయని తల్లికి వందనం, ఉపాధిహామీ వేతనం, పీఎం కిసాన్ నగదను ఖాతాల్లోంచి బ్యాంకు సిబ్బంది మళ్లిస్తున్నారని దుర్గమ్మ సంఘం అధ్యక్షురాలు గంపరాయి అమ్మి, కార్యదర్శి సీతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు, బ్యాంకు సిబ్బందిపై విచారణ చేసి న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందని వారు తెలిపారు.

ఉద్యోగుల గ్రీవెన్సుకు ఫిర్యాదులు

పాడేరు: పాడేరు డిఆర్ఒ కె. పద్మలత, పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్లో గ్రీవెన్సు నిర్వహించారు. ఉద్యోగుల గ్రీవెన్సుకు 6 ఫిర్యాదులు అందాయని డి. ఆర్ ఓ కె. పద్మలత తెలిపారు. చింతపల్లి తహశీల్దారు కార్యాలయాలనికి చెందిన సీనియర్ సహాయకులు జి.హరికృష్ణ చింతపల్లి నుండి అరకువ్యాలీకి బదిలీ చేయాలని వినతిపత్రం అందజేసారు. పాడేరు మండలం గిరిజన సంక్షేమ శాఖ ఎన్డీసీ కార్యాలయం డిప్యూటీ తహశీల్దారు కె. దొన్ను తనకు ముంచంగి పుట్టు తహశీల్దారు కార్యాలయం డిప్యూటేషన్ వేసారని డిప్యూటేషన్ రద్దు చేసి ఎన్డీసీ కార్యాలయం లో నియమించాలని కోరారు. అనంతగిరి మండలం వి. విజయమణి తన భర్త అరకు వ్యాలీ మండలంలో ఉద్యోగం చేస్తున్నారని తనకు అరకువ్యాలీ మండలానికి బదిలీ చేయాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పరస్కరరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఫార్మాలో క్వాలిటీ డిజైన్ :బహుళ విభాగాల పరిశోధన, అభివృద్ధికి ఒక వ్యవస్థాత్మక రూపకల్పన" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఔషధ రంగంలో ఫార్మాస్యూటికల్ విశ్లేషణ, క్వాలిటి అస్యూరెన్స్ విభాగం పరిశోధకుడు డాక్టర్ సాగర్ సుమన్ పాండా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువతకు ఫార్మశీ రంగంలో నాణ్యత, ప్రమాణాలు, ఫార్మాలేషన్, అనలిటికల్ పద్దతుల అభివృద్ధి, క్లీనికల్ ట్రయిల్ క్వాలిటి సిస్టమ్స్‌పై లోతైన అవగాహన కల్పించారు. క్వాలిటీ బై డిజైన్ మౌలికాంశాలు, డిజైన్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, అనువర్తనాలు ఫార్ములేషన్, అనలిటిక్స్, రెగ్యులేటరీ క్వాలిటి అస్యూరెన్స్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డేటా ఆధారిత ఫార్మాస్యూటికల్ పరిశోధనపై ఆసక్తిని ప్రేరేపించడంతో పాటు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందే లక్ష్యాలపై యువతకు దిశా నిర్దేశం చేశారు. ఫార్మశీ విద్యార్థులు నిరంతరం అభ్యాసకులుగా కొత్త విషయాలను నేర్చుకుంటూ ఎదగాలన్నారు. భావప్రకటన సామర్థ్యం, పరిశోధనల పట్ల ఆసక్తి, ఎంపిక చేసుకున్న అంశాలపై లోతైన అవగాహన ద్వారా అంచెలంచెలుగా ఎదగాలన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా డాక్టర్ జి.సౌజన్య సమన్వయకర్తగా వ్యవహరించారు.కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధన స్కాలర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ సేవలకు అంతరాయం

ప్రజాశక్తి-పాడేరు : భారత తపాలా శాఖ సేవలకు ఈనెల 19 నుంచి 22వ వరకు అంతరాయం కలుగుతుందని పాడేరు డివిజనల్ పోస్టల్ ఇన్స్పెక్టర్ వై దిలీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ.టి 2.0 రోల్ అవుట్ కారణంగా నేటి నుంచి ఐదు రోజుల పాటు పోస్ట్ ఆఫీస్ లో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు గానీ బుకింగ్ లావాదేవీలు జరగవని పేర్కొన్నారు. కావున పాడేరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న జి.మాడుగుల పాడేరు వి.మాడుగుల, హుకుంపేట మండలాల ప్రజలు, పోస్టల్ ఖాతాదారులు గమనించాలని కోరారు ఈనెల 23వ తేదీ నుంచి యధావిధిగా పోస్టల్ సేవలు అందుబాటులోకి రానుందని తెలిపారు.

క్రీడా మైదానం అభివృద్ధికి సహకరించండి



బోస్‌కు విన్నవిస్తున్న ఆనందపురం హైస్కూల్ హెచ్‌ఎం, పిఇటిలు

ప్రజాశక్తి -ఆనందపురం : క్రీడా మైదానం అభివృద్ధికి సహకరించాలని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం, పిఇటిలు కోరారు. శుక్రవారం గిడిజాలలో సామాజిక సేవకుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌కు వినతిపత్రం అందజేశారు పాఠశాలకు రెండున్నర ఎకరాల ఆటస్థలం ఉందని, పాఠశాలలో 800 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఇప్పటికే ఈ మైదానంలో ముగ్గురు ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులకు క్రీడా శిక్షణ అందిస్తున్నారని, తద్వారా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఇక్కడి విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులతో పాటు హాస్టల్ బాలబాలికలు, గ్రామీణ యువత కూడా ఈ మైదానాన్ని ఉపయోగించుకుని పోలీస్, ఆర్మీ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు శారీరకంగా సన్నద్ధమౌతున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రీడామైదానంలో అథ్లెటిక్స్ ట్రాక్, లాంగ్ జంప్, హైజంప్ పిట్లు, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులు, మినీ స్టేడియం వసతి, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు, జిమ్ పరికరాలు, క్రీడా సామాగ్రి నిల్వ గొడౌన్ వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా భావి క్రీడాకారులు, ఉద్యోగార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. దాతగా ముందుకు వచ్చి క్రీడామైదానం అభివృద్ధికి తోడ్పాటునందిచాలని కోరారు.దీనిపై ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ స్పందిసూ, క్రీడామైదానం అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ తరపున సహకరిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి ప్రసాద్ బుజ్జి, తాత్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, ఎర్ర రాము, కాకర వెంకటరమణ, పాండ్రింకి అప్పలరాజు, ఆబోతు అప్ప, గొలగాని కృష్ణ, కర్రోతు సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపుతో

ప్రభుత్వ పాఠశాలల మనుగడ

ప్రజాశక్తి-గాజువాక : విద్యార్థుల నమోదును పెంచడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నికయింది.

యుటిఎఫ్ గాజువాక మండలశాఖ నూతన తాత్కాలిక కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇమంది ప్రసాద్, సబ్బారపు నూకరాజు, గౌరవాధ్యక్షులుగా కట్టిపోగు మురళీకృష్ణ, సహ అధ్యక్షులుగా మొహమ్మద్ అబ్దుల్ హక్, బి. సుగుణ, వి.ఎస్తేరురాణి, కోశాధికారిగా ఎస్‌వి.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నిడదవోలు శ్రీనివాస్‌రాజు, ఎ.విజయకుమారి, ఎస్.అపరంది, ఐ. స్వర్ణలత, బి.సువర్ణలత, ఎ.అన్నపూర్ణేశ్వరి, మండల కార్యవర్గ సభ్యులుగా రవికుమార్, అనితకుమారి, నీరజ, పి. విజయదుర్గ, సిపిఎస్ కన్వీనర్‌గా నూకరాజు,ఆడిట్ కమిటి సభ్యులుగా జ్యోత్స్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో, జిల్లా నాయకులు అప్పారావు, గోపాలపట్నం ప్రధాన కార్యదర్శి సింహాచలం, విజయకుమార్, ప్రసాద్, లక్ష్మి కుమారి, మహిమరావు పాల్గొన్నారు.

పోతురాజుబాబు మెట్ట చెరువు గండి పూడ్చాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కింద్రకాలనీ గ్రామంలో పోతురాజుబాబు మెట్ట చెరువుకు పడిన గండిని తక్షణం పూడ్చాలని గ్రామరైతులు కోరుతున్నారు. సుమారు 200 ఎకరాల్లో పొలాలకు నీరు అందించే ఈ చెరువు రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. వర్షపు నీరు వృథాగా పోతోంది, దీంతో రైతులకు సాగుకు ఇబ్బందిగా ఉందని రైతు, ఆదివాసి జెఎసి నాయకులు గంపా నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మరో సాగునీటి వనరు ఎత్తిపోతల పథకం కూడా మోటర్ పాడైపోవడంతో నిరుపయోగంగా పడి ఉందని తెలిపారు. తక్షణం అధికారులు స్పందించి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామ రైతులు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి వేతనదారులు

ఉపాధి వేతనాలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పంచాయతీలో ఆదివాసీ నాయకులు తెడ్ల రాంబాబు ఆధ్వర్యంలో ఉపాధి వేతనాలు చెల్లించాలంటూ ఉపాధి వేతనదారులు శుక్రవారం జడ్డంగి సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీనేత రాంబాబు మాట్లాడుతూ.నేటికి 8 వారాల నుండి ఉపాధి వేతనాలు రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు తక్షణం చెల్లించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, శ్రామికులు పులిమెట్ల రమణ, మోడిద వేంకటేశులు, మొల్ల లక్ష్మి, పులిమెట్ల భారతి, తెడ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలి

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని ఎంఇఒ1 కెవివి సత్యనారాయణదొర, ఎంఇఒ 2 సూరయ్యరెడ్డి సూచించారు. మండలంలోని అనంతగిరి పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని అనే వార్త ప్రజాశక్తిలో ప్రచురించిన నేపథ్యంలో అధికారులు స్పందించి శుక్రవారం మండలంలోని అనంతగిరి, ముంజవరప్పాడు, కింద్ర, కింద్రకాలనీ, చీడిపాలెం గ్రామాల్లో ఉన్న పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. అనంతగిరి పాఠశాలలో అదనంగా మరొక ఉపాధ్యాయుని నియమించనునట్లు ఎంఈఓ సత్యనారాయణదొర తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజనం అమలు పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

పంచాయతీ పురోగతిపై శిక్షణ

ప్రజాశక్తి - వై.రామవరం : మండలంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బాపన్నదొర పంచాయతీల పురోగతి అంశాలపై శిక్షణ సమావేశం నిర్వహించారు. శిక్షణలో పేదరిక నిర్మూలన ఆరోగ్యకరమైన పంచాయతీ సామాజిక న్యాయం మహిళా స్నేహపూర పంచాయతీ వంటి 17 అంశాల గురించి వివరించారు. ఈ శిక్షణలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో కరిదేవుపాలెం పాఠశాల

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

కొత్త భవనం నిర్మాణం చేపట్టాలి : గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీ, కరిదేవిపాలెం ఎంపిపి పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరిదేవుపాలెం ఎంపిపి పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు సుమారు 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబుపెచ్చులు ఊడి పడుతున్నాయని గోడలు బీటలు వారి కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, వర్షం కురిస్తే నీరు పాఠశాల గదిలోకి చేరి విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి నెలకొందని పిఎంసి కమిటి, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులకు ఈ పరిస్థితి గురించి వివరించామని, గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడులో పాఠశాల భవనం నిర్మిస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటికీ హామీలు అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీ, వంటషెడ్డు లేవని తక్షణం అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.



పెచ్చులూడిపోయిన పాఠశాల భవనం

తక్షణం కొత్త భవనం నిర్మించాలి



కరుదేవుపాలెం గ్రామంలో ఉన్న ఎంపిపి పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా ఉంది. ఈ నేపథ్యంలో తక్షణం అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలి.

– సిద్దా దుర్గాదేవి, పిఎంసి కమిటి ఛైర్మన్

కొత్త భవనం నిర్మించకుంటే ఆందోళన



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న కరుదేవుపాలెం ఎంపిపి పాఠశాల భవన స్థానంలో కొత్త భవనం నిర్మించాలి. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

– కొండ్ల సూరిబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి

అధికారులకు నివేదించాం

కరుదేవుపాలెం పాఠశాల పరిస్థితి ఇప్పటికే అధికారులకు నివేదించాం. మండలంలో 9 పాఠశాలలను గుర్తించి ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రభుత్వ నిధులు మంజూరు కాగానే కొత్త భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– కె.వి.వి. సత్యనారాయణదొర, ఎంఇఒ, రాజవొమ్మంగి

మెట్రోరైలు ప్రాజెక్టుపై మోదం.. ఖేదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టు అమలు అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) సుధా సాగర్ ఆధ్వర్యంలో విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టు(విఎంఆర్ పి) అమలులో భాగంగా భూములసేకరణకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భూసేకరణ, పునరావాసం, న్యాయమైన పరిహారంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా భూ సేకరణపై సామాజిక ప్రభావ లెక్కింపు, అధ్యయనం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. కార్యక్రమములో 35 వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 39వ వార్డ్ కార్పొరేటర్ మహమ్మద్ షాదిక్, స్థానికులు సుమారు 200 మంది వరకు హాజరయ్యారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ, వెలంపేట, కల్లుపాకలు నివాసితులు, మెట్రోరైలును వ్యతిరేకిస్తున్నారని, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. 39వ వార్డ్ కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ మాట్లాడుతూ, మెట్రో రైలును స్వాగతించారు. అయితే ఈ ప్రాజెక్టు అమలులో స్థలాలు, భవనాలు కోల్పోయే వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. చివరిస్టాప్ లక్ష్మీటాకీస్ పార్క్ వద్ద నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు వ్యాపారులు, ముఖ్యంగా మెట్రో మార్గంలో షాపులు కలిగి ఉన్నవారు,మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు వ్యతిరేకించారు.

ఎపిలో స్వార్థపూరిత ప్రతిపక్షం ఉండడం దురదృష్టకరం

రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

తమిళనాడులో పార్టీలు రాజకీయంగా విభేదించినా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తాయని, అదే మన రాష్ట్రంలో మాత్రం స్వార్థపూరిత ప్రతిపక్షం ఉండటం దురదృష్టకరమని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ఆరోపించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులు, తప్పిదాలు, దృష్టి మరల్చడానికి జగన్ విషం చిమ్ముతున్నారన్నారు. ప్రభుత్వం మీద విమర్శలు చేసి, అబద్దాలే పునాదిగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయలబ్ధి కోసం ఇదంతా చేస్తున్నారన్నారు. గతంలో 70 శాతం పూర్తి చేసిన పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని దుస్థితికి తీసుకువెళ్లింది జగన్ ప్రభుత్వం అన్నారు. జగన్ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాడని, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ఆ ప్రయోజనాలు పొందేలా చేస్తామన్నారు. జగన్ బాధ్యతగల రాజకీయ నాయకునిగా పనిచేయాలన్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే అడ్డుకుంటున్న పోలీసులను కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం అధికారులకు అండగా ఉంటుందన్నారు. జగన్ మీడియాను టిష్యూ పేపర్‌తో పోల్చారంటే, మీడియాపై ఆయనకి ఎలాంటి గౌరవం ఉందో చూడాలన్నారు. జగన్‌కి ఏ వ్యవస్థ మీదా గౌరవం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.



రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

ఖరీఫ్‌కు నీరు విడుదల

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి రిజర్వాయర్ నుండి ఖరీఫ్ పంటకు నీటిని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి శుక్రవారం విడుదల చేశారు. ముసురుమిల్లి రిజర్వాయర్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం దేవీపట్నం మండలానికి ఖరీఫ్ పంటలకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, పార్టీ నాయకులు అనంత మోహన్, వై.నిరంజనీ దేవి, అడబాల బాపిరాజు, వెంకన్న దొర మరియు దేవీపట్నం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విఆర్ పురం: మండలంలోని చిన్నమటపల్లి పంచాయతీలో సర్పంచ్ పిట్ట రామారావు పంచాయతీ నిధుల నుండి. తుష్టివారిగూడెం, ప్రత్తిపాక, గుండుగూడెం, చింతరేగుపల్లి, కన్నాయి గూడెం, సున్నావారిగూడెం, చినమ్మటపల్లి, వెంకంపాలెం గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గతంలో వీధిలైట్లు లేవని ఆయా గ్రామస్తులు ఫిర్యాదు చేయగా వీటిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, ఉపసర్పంచ్ కారం సుజాత గ్రామస్తులు పాల్గొన్నారు.



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేడు బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విశాఖపట్నం నగరంలోని ఆర్కే బీచ్‌రోడ్‌లో తలసేమియా రన్ (10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలో మీటర్లు) నిర్వహిస్తున్నందున, శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు బీచ్‌రోడ్‌లో ఆంక్షలు విధిస్తూ నగర ట్రాఫిక్ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ క్రమంలో అల్ ఇండియా రేడియో జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్, పందిమెట్ట జంక్షన్, ఎన్‌సిబి జంక్షన్, పార్క్‌హోటల్ జంక్షన్, కురుపాం సర్కిల్, జోడుగుళ్ళపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ డైవర్షన్ చేస్తామని అధికారులు తెలిపారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు తలసేమియా రన్‌లో పాల్గొనే వారి వాహనాలను అల్ ఇండియారేడియో జంక్షన్ దగ్గరలో ఎపిఐఐసి గ్రౌండ్, ఎన్టిఆర్ సర్కిల్ దగ్గరలో సి-పెరల్, ఆంధ్ర యూనివర్సిటీ అవుట్‌గేట్ దగ్గరలో ఎయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ పార్క్‌హోటల్ దగ్గరలో గల ఎంజిఎం గ్రౌండ్, డచ్‌హౌస్ అపార్ట్మెంట్స్ ఎదురుగా, నియర్ పార్క్ హోటల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

జిఒ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇంజనీరింగ్ వర్కర్లకు జిఒ 36 ప్రకారం అన్ స్కిల్డ్‌కు రూ.21 వేలు, సెమీ స్కిల్డుకు రూ 24,500 చెల్లించాలని,అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని, డెత్, రిటైర్డ్ పోస్టులను కార్మికుల బిడ్డలతో ఫిల్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు చేయాలని, 17 రోజుల సమ్మె ఒప్పందం వెంటనే అమలు చేయాలని కోరుతూ చేస్తున్న రాష్ట్ర సమ్మెలో కార్మికులంతా భాగస్వాములు కావాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ఫ్రంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపు ఇచ్చారు. శుక్రవారం తాటిపూడి రిజర్వాయర్ పంప్‌హౌస్ కార్మికుల ఉద్దేశించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్త సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతు తెలుపుతూ వారి సమ్మె డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా శనివారం 10:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుండి పారిశుధ్యం, మలేరియా, వెటర్నరీ, పార్కులు, క్రాప్ డ్రైవర్లు, లోడర్లు సకల కార్మికులు నిర్వహించే సంఘీభావ మహార్యాలీలో నీటిసరఫరా కార్మికులు పాల్గొనాలని కోరారు.